
అందరికీ ఉత్తరాలు రాశాను. సన్నిహితులు అనిపించిన ప్రతివాడికీ ఉత్తరం వ్రాశాను. ఏకబిగిన, ఒకటి! రెండు! . . . పన్నెండు! డజను ఉత్తరాలు వ్రాశాను. ఎంత బరువైన విషయం! ఈ విషయం ఎంతమందితో చెబితే మనసు కుదుటబడుతుంది?

ఉత్తరాలు పోస్టుచెయ్యటానికి వెంటనే లేచాను. ఒక్కక్షణం కూడా ఆగలేకపోయాను. దూసుకుంటూ పోయి బయట గడప దిగేటప్పుడు, బుష్‌షర్టు పైగుండీ పెట్టుకుంటూ తల పైకెత్తాను.

అయిదారు గజాల దూరంనుంచి, తెల్లని బట్టా,




కోడిగుండూ, దానిమీద ముసుగూ — గుమ్మడి కాయలా గుడ గుడ దొర్లుకుంటూ పక్కింటి అమ్మమ్మ నా కెదురుగా వస్తోంది.

జావగారిపోయాను. ఒళ్లు మండిపోయింది. ఛీ! పాడు మొహం! గిరుక్కున తిరిగి ఉసూరుగానే ఇంట్లోకి వచ్చేశాను.

ఏదో పని చూసుకోబోతున్న అమ్మ ఆగిపోయింది. నాన్నగారు నా వంక వింతగా చూశారు.

"ఏమిట్రా, బాబూ, అలా వచ్చేశావు!" అమ్మ

కొయ్యబారిపోయిన ట్లడిగింది.

"వెధవ మొహం ఎదురు వచ్చింది." నాన్నగారున్నారన్న జంకుతో ఎంత మెల్లిగా అన్నా, కసికొద్దీ చాలా మొరటుగా అన్నాను.

నాన్నగారు విసుగ్గా మొహం పెట్టారు. "ఏమిట్రా, నీక్కూడా ఈ ఛాదస్తం! పైగా ఒక యూనివర్శిటీలో రీడర్‌వి!" అన్నారు.

చెంపమీద ఛెళ్ళున కొట్టినట్లయింది. 'పైగా యూనివర్శిటీలో రీడర్‌వి!' అన్న మాట 'నీ మొహానికి సిగ్గు లేదూ!' అని అడిగినట్లుంది.

సిగ్గుతో కుంచించుకుపోయాను. క్షణంకూడా నిలబడలేకపోయాను. పడకగదిలోకి పోయి పక్కమీద వాలిపోయాను.

'అవును! ఏమిటి ఇలా చేశాను? అమ్మమ్మ ఎదురువస్తే ఏమయింది? ఏమవుతుంది? ఏమైనా అయితే దానికి అమ్మమ్మ ఎంతవరకు బాధ్యురాలు?'

'ఛీ! ఎంత పాడుపని చేశాను! ఒక దిక్కులేని విధవరాల్ని ఎంత చులకనచేశాను! ఎంత నొప్పించి ఉంటాను! ఛీ! ఎందుకు నా చదువు! ఎందుకు నా సంస్కారం!' ముఖం దిండులో దాచుకుని కుమిలిపోయాను.

కానీ, నాలో ఆ క్షణికమైన పశుత్వం ప్రజ్వరిల్లటానికి కారణం ఉంది. నా పెళ్ళి నిశ్చయమైంది. దాని గురించే ఈ ఉత్తరాలన్నీ! కానీ ఈ పెళ్ళి ఒక

# సుమంగళి

పెద్ద సమస్య. 'వైవాహిక జీవితంలో ఆ అమ్మాయి నాకెంత గౌరవం ఇస్తుంది? ఇస్తుందా? ఇవ్వదా?' — అనుక్షణం అదే ప్రశ్న! జవాబు తెలియక సతమతమవుతున్నాను. ఆ వేడిలో అమ్మమ్మ ఎదురు రావటం నేను సహించలేకపోయాను.

* * *

యూనివర్శిటీకి సెలవులు. మా ఊరు వచ్చాను. రైలుబండి రెండు నిమిషాలైనా ఆగని మా ఊరు వచ్చాను. అమ్మ ఆ సంబంధం గురించి చెప్పింది. నేను మాట్లాడలేదు. ఆలోచిస్తూ ఊరుకున్నాను.

అయిదో ఏడునుంచి ఇప్పటిదాకా, అంటే సుమారు ఇరవై రెండేళ్ళు, నా చదువూ, సబ్జెక్టూ రిసెర్చీ తప్ప వేరే విషయం నేను పట్టించుకుని ఎరగను. కీర్తో, అపకీర్తోగాని "పుస్తకాల పురుగు" అన్నది నా మారుపేరై కూర్చుంది. అలాంటి నాకు ఇప్పుడు చదవాలంటే బోరు కొడుతూంది. జీవితం చప్పిదంటులా అర్థం లేనట్లయింది. ప్రపంచంలో ఆనందంగా ఉండే మనుష్యులంతా గుమిగూడి, అలా ఉండలేని నన్ను — ఒక్కణ్ణీ — వేరుగా ఉంచేసినట్లు అనిపిస్తూంది. ఆ ఒంటరితనాన్ని నేను భరించలేకపోతున్నాను. జీవితం మీద చిరాకు పుడుతూంది. ఏవో అవ్యక్తమైన బాధ కలుగుతూంది. ఈ బాధ పంచుకోటానికి మనస్సు ఆత్మీయులైన స్నేహితుల్ని కోరుతూంది. అందుబాటులో ఉన్న స్నేహితుల్ని తిరస్కరిస్తూంది.

**తాను కోరిన ఆకర్షణ, ప్రేమ భర్తలో లేవని గుసుస్తూ జీవితాన్ని నిర్జీవంగా మార్చుకుని బ్రతికే స్త్రీ 'భర్త ఉన్న వితంతువు.' భర్త చనిపోయినా, అనుక్షణం ఆయననే స్మరిస్తూ, మంచి చెడ్డలను ఆయన పరంచేసి, తనను తాను పూర్తిగా అంకితంచేసుకుని, అర్పించుకున్న వితంతువు 'నిత్య సుమంగళి.' జీవితాన్ని నిండుగా అనుభవించిన పుణ్యస్త్రీకన్న పునిస్త్రీ, ఏ విధంగానూ ఎక్కువ కాదు.**

అమ్మ మాటలు మనస్సులో మెదిలాయి!

"లేత గులాబీ పువ్వులాంటి చాయ! నాజూగా, అందంగా ఉండే పిల్ల! ఎం. ఎ. చదివిన పిల్ల! వినయ విధేయతలు గల పిల్ల! ఈడూ జోడైన పిల్ల! ఆ అమ్మాయితో జీవితాంతం వీడని సాహచర్యం! ఎంత చల్లని ఊహ! జ్వరం మండిపోతున్న నుదుటిమీద చల్లని గుడ్డ వేసినట్లు ఎంత హాయి!

ఆ అమ్మాయి నాదైతే . . . లాబ్‌నుంచి చిరాకుగా వస్తాను! మనసంతా గందరగోళంగా ఉంటుంది! ఇంట్లో ఆమె ఉంటుంది. ఆప్యాయంగా, చల్లగా, తీయగా పాడుతుంది. ఆమె పాడబోతున్న తీయని రాగం అలవోకగా వినిపించినట్లయింది.

ఆ ఊహ నన్ను ఉక్కిరి బిక్కిరి చేసింది. వడదెబ్బకి స్పృహతప్పి పడిపోతున్నవాడికి మొహంమీద చల్లని పన్నీటిజల్లు పడేసే కొడుతున్నట్లు అనిపించింది.

అందుకే నేనేమీ మాట్లాడలేదు. పెళ్ళిచూపులకి బెజవాడ వెళ్ళాను. నేనూ, బాబాయీ వాళ్ళింటికి వెళ్ళాము. పెళ్ళిచూపులంటే నాకేదో భయం. పెళ్ళికోసం ఆ అమ్మాయిని చూడటం అంటే భయం. చూడబడటం అంటే భయం. అక్కడ జరిగిన సంభాషణలో "జీ ఆలజీ" కి సంబంధించిన ఒకటి రెండు ముక్కలు తప్పించి నేనాట్టే మాట్లాడలేదు. అంతకన్నా మాట్లాడడం నాకు చేతకాదు.

ఆ అమ్మాయి వచ్చింది!

నాకు గుండెదడ! కళ్ళు బైర్లు కమ్మినట్లయింది.

అతి ప్రయత్నంమీద ధైర్యం తెచ్చుకుని ఆ అమ్మాయి వంక చూశాను. క్షణంసేపు మెదడు మొద్దుబారిపోయింది. అంతకన్న ఆ అనుభూతిని నేను వర్ణించలేను. అమ్మ వర్ణనకి వేయిమెరుగులు దిద్ది, నేను ఊహించుకున్న అమ్మాయికన్న ఈ అమ్మాయి కొన్ని లక్షల రెట్లు అందంగా ఉంది. "హేమలత" అని సాగ గొట్టేసిన బంగారు తీగలాంటి సన్నని కంఠంతో తన పేరు చెప్పింది. ఆ పైన శ్రావ్యమైన కృతి వినిపించింది. కృతి ఏమిటో కూడా గమనించలేకపోయాను. ఆ గొంతులో కరిగిపోయాను.

పెళ్ళిచూపు లైపోయాయి! బాబాయి ఇంటికి వచ్చేశాను!

## మెట్టపల్లి కామేశ్వరశర్మ

"ఏరా! బాబూ! నీ కిష్టమేనా?" పెళ్ళి సద్దంటూ నేమోనన్న జంకుతో బాబాయి మెల్లిగా అడిగాడు. నేను అరక్షణం కూడా ఆలోచించలేదు. "ఊఁ!" అన్నాను. బాబాయి ఒక్క గావుకేక పెట్టాడు. అంతే! ఆ ఇంట్లో ఒకటే గోల! "అన్నయ్య పెళ్ళి! అన్నయ్య పెళ్ళి! వదిన వచ్చేస్తుంది!" బాబాయి పిల్లలంతా చప్పట్లు కొడుతూ నన్ను చుట్టు ముట్టారు. పోపు పెడుతున్న పిన్ని గరిట అక్కడ పారేసి ఆ కోలాహలాన్ని దూసుకుంటూ వచ్చింది.

"ఏమయ్యా! కోడలంత బావుందా?" పరాకోళం చేస్తున్న పిన్ని మొహంలో ఎంత ఆనందం! గావుకేకలు పెడుతున్న బాబాయికి ఎంత ఆనందం! "ఊఁ!" అన్న ఆ క్షుద్రమైన మూలుగు వల్ల నే నెంతమందిని ఆనందపరిచాను! అప్పటి నా ఆనందం జీవితాంతం అలాగే ఉండిపోతే ఎంత బావుండును!

రంగనాథంగారు (పెళ్ళికూతురు తండ్రి) బాబాయి దగ్గరికి ఏ సంగతి తెలుసుకోటానికి ఆ సాయంత్రమే వస్తానన్నారు. ఆ రాత్రికి ఉండిపొమ్మని బాబాయి, పిన్ని, పిల్లలూ ఎంత బలవంత పెడుతున్నా వినకుండా నే నా సాయంత్రమే మా ఊరికి బయలుదేరాను.

మా ఊరు పోయే బస్సులో కూర్చున్నాను. బస్సు చాలా ఖాళీగా ఉంది. ఆ సీటులో నే నొక్కణ్ణే! మనసు ఆనందంలో తేలిపోతూంది. కిటికీలోనుంచి బయటకు చూశాను.

అంతే! గుండె ఆగిపోయినట్లయింది! ఎవరో అమ్మాయి! హేమలతే వినిపించింది! ఏదో ఆత్రత! ఆందోళన! మరోసారి ఆ అమ్మాయి వంక చూశాను.

ఆ అమ్మాయి హేమంత కాదు!

కానీ సరిగ్గా హేమలత అంతే ఉంది. శరీరపు తీరు సరిగ్గా అదే. ఆడవాళ్ళ వెయిటింగ్ రూము ముందు నిలబడి ఉంది. కానీ ఈమెలో ఆ లావణ్యం లేదు! ఆ అందం లేదు! ఆ ఆకర్షణ లేదు! కానీ ఈ అమ్మాయి ముఖం ఉత్సాహంతో వెలిగిపోతూంది! దూరంగా గుంపులో తనకి బాగా ఇష్టమైన వ్యక్తిని గుర్తుపట్టినట్లు చేయి ఊపుతూ సంతోషంగా అటువైపు చూస్తూంది.

నే నటువైపు చూశాను.

ధగధగా మెరుస్తున్న తెల్లని దుస్తులు! నిగనిగలాడుతున్న నల్లని షరాప్! చక్కగా అణచి దువ్విన ఉంగరాల జుట్టు! టక్‌చేసి టై కట్టాడు. ఆ గుంపులో పొడుగ్గా, స్మార్ట్‌గా కొట్టవచ్చినట్లున్నాడు. ఈ అమ్మాయిని చూసి "హల్లో!" అంటూ గావుకేకపెట్టి, గుంపుని చీల్చుకుని ఈ అమ్మాయి వైపు దూసుకు వస్తూంటే, అతను మూర్తీభవించిన ఉత్సాహంలో ఉన్నాడు.

జావగారిపోయాను.

అతని తెల్లని దుస్తులు చూస్తూంటే నా దుస్తులు మడ్డిబట్టై ఒంటికి అతుక్కుపోతున్నట్లు అనిపించింది. అతని అణచి దువ్విన ఉంగరాల జుట్టు చూస్తూంటే, అంటకత్తెర వేసిన నా జుట్టు మీదినుంచి ముఖం మీదికి నూనె గారుతున్నట్లు అనిపించింది. "హల్లో" అని ఆమె వైపు దూసుకుపోతున్న అతని ఉత్సాహం చూస్తుంటే నే నొక వానపాము ననిపించింది. లాబ

రేటరీకి పోయేటప్పుడు రిసెర్చి స్కాలర్సు, స్టూడెంట్సు ఎవరైనా నమస్కారంచేస్తే నేనెంత సిగ్గుపడిపోతాను! 'నా కెందుకూ ఇంత గౌరవం?' అని ఎలా కుంచించుకు పోతాను! అతనొక ఆడదాన్ని ఎంతగా ఆకర్షించాడు! ఇంతవరకూ ఒక్క ఆడదీ నన్ను గమనించనైనా గమనించలేదు.

నే నామె వంక చూశాను.

మెడలో సన్నని గొలుసు. పెళ్ళికాలేదు. అత నామెకి స్నేహితుడు మాత్రమే! సందేహంలేదు! భర్త కాదు! కానీ గుంపులో ఉన్న ఇతనిని ఈమె ఎంత నిస్సంకోచంగా దగ్గిరికి పిలుస్తోంది! అత నెంత నిస్సంకోచంగా ఆమె దగ్గిరికి వెడుతున్నాడు! ఇలాంటివి మహానగరాల్లో మామూలే కావచ్చుగాక! కానీ బెజవాడలో ఇలాంటివి నేను ఊహించలేదు. ఊహించలేను. అందుకే సహించలేక పోయాను. వాళ్ళంటే పట్టరాని అసహ్యంవేసింది.

వాళ్ళు నాలో అనుమానాన్ని రేకెత్తిస్తున్నారు! భరింపరాని భయాన్ని కలిగిస్తున్నారు! నా అంతులేని ఆనందాన్ని సర్వనాశనం చేస్తున్నారు!

అవును! హేమలత ఈమెకన్న అనేక రెట్లు అందంగా ఉంటుంది. చదువులో, సంగీతంలో ఈమెకీ, హేమలతకీ అసలు పోలికే లేకపోవచ్చు. ఎం. ఎ. చదవటానికి హేమలత రెండేళ్ళు తలిదండ్రులకి దూరంగా ఉంది. ఆ రెండేళ్లలోను హేమలత ఎంతమందిని ఆకర్షించి ఉండవచ్చు? నా కన్న ఆ కనిపిస్తున్న వ్యక్తి అనేకరెట్లు ఆకర్షణీయంగా ఉన్నాడు! అలాంటివా ళ్లెందరో హేమలతని ఆకర్షించి ఉండవచ్చును!

నా కళ్ళు తిరిగాయి! నా బుర్ర బద్దలై పోతూం దనిపించింది.

ఛీ! అసలు నే నామెతో ఎందుకు మాట్లాడలేదు? ఆమె స్వభావం ఎలాటిదో నే నెందుకు గ్రహించలేదు? ఆడదానితో మాట్లాడటానికి నా కెందుకు అంత భయం? ఎందుకు అంత బిడియం? నాకేం తక్కువని?

ఎందు కంత తొందరపడి నేను "ఊఁ!" అనాలి?

బస్సుస్టాండ్‌లో కనిపిస్తున్న ఈ అమ్మాయి కన్న అన్ని విధాలా మెరుగైన హేమలత ఎంతమంది మగవాళ్ళని ఆకర్షించింది?

ఎం. ఎ. చదివే రెండేళ్లలోను నాకన్నా మెరుగైన ఎందరు మగవాళ్ళు హేమలతని ఆకర్షించారు?

ఏ ఆకర్షణా లేని నేను హేమలతని ఎంతవరకు ఆకర్షించగలను?

నేను టైము చూసుకున్నాను. సాయంత్రం ఆరున్నర అయింది. బాబాయి నా సమ్మతిని వాళ్లకి తెలిపిఉంటాడు.

బస్సు కదిలింది.

* * *

నే నిప్పు డేం చెయ్యాలి? ఏమి చెయ్యాలి? ఆ రోజు నించి అదే ప్రశ్న. ఆ ఉత్తరాలు పోస్టు చేశాను. కానీ గుండె బరువు తగ్గలేదు.

రోహిణి కార్తె. ఎండ రోళ్లు బద్దలు కొడుతూంది! వడగాలి! తలుపులన్నీ బిడాయించినా వేడి! ఉక్క! సాయంత్రం ఆరింటికి కొద్దిగా చల్లబడింది.

"తలనొప్పిగా ఉంది" అన్నాను. అనటంతో నా బాధ మొదలయింది.

"ఊహుఁ! విపరీతమైన ఆలోచన, మవ్వాను! ఎప్పుడూ ఆలోచనే! దేని గురించో! ఏమిటో? అర్థం లేని ఆలోచన! బుర్ర వేడెక్కి ఉంటుంది! తలంటి పోసుకో!" అంది అమ్మ.

"వద్దమ్మా!" అన్నాను.

అమ్మ బతిమాలింది. కోప్పడింది, విసుక్కుంది.

"వద్దమ్మా!" అన్నాను.

"అమ్మ అంతగా చెబుతుంటే! పోసుకో" అన్నారు నాన్నగారు.

అంతే! — రాఘవులు వచ్చాడు!

తలంటి పూర్తి అయ్యేసరికి దీపాలు పెడుతున్నారు.

"తల తుడుచుకోవటం కూడా చేతకాదు! రేపొ అమ్మాయి నిన్ను ఎలా చూసుకుంటుందో? ఏమో?" — నా చేతిలో తువ్వాల గుంజుకుని అమ్మ తల తుడిచింది. బొట్టు పెట్టింది.

అంతలో పక్కింటి అమ్మమ్మ ఈదురుగాలిలా మా ఇంటికి దూసుకువచ్చింది. అమ్మమ్మని చూడటానికి నేను సిగ్గుపడ్డాను. కానీ అమ్మమ్మ సరాసరి అమ్మ దగ్గిరికి వచ్చింది. నెత్తి ముసుగు దీసి, బుర్ర వంచి అమ్మకి చూపిస్తూ "ఇదేమిటో తడిగా ఉంది! చీకట్లో కనిపించి చావదు! కాస్త చూడవే, అమ్మడూ!" అంది.

> ## ఆత్మస్తుతి
>
> తన్నుతాను ఆకాశాని కెత్తివేసుకోవడము; అథఃపాతాళానికి తొక్కివేసుకోవడము—రెండూ దొసగులే.
>
> —గెటే
>
> * * *
>
> ## ఆశ
>
> అతి చిన్న ప్రాణిలో పెద్ద ఆశను ఇరికించలేవు.
>
> —జి. ఎల్. జోన్స్
>
> * * *
>
> ## నమ్రత
>
> పుష్పాలకు సువాసన అబ్బినట్లే సున్నిత హృదయులకు నమ్రత అలవడుతుంది.
>
> —గ్రెవిల్

ఆ బోడిగుండు చూపించటం చూసి నవ్వు ఆపుకోబోతున్న నేను, "అయ్యయ్యో! ఇదేమిటి పిన్నీ!" అని అమ్మ ఆందోళన పడుతుంటే కంగారు పడ్డాను. ఆపైన ఆదిరిపడ్డాను.

అమ్మమ్మ నెత్తిమీద గాయం. ముసుగు మీద చారెడు నెత్తురు మరక.

"ఏమిటోనే, అమ్మా! వంట చేసుకుంటున్నాను! ఏమి తోసివయ్యో? ఏం పాడో? పైన అటకమీద మంచి కట్టెపుల్లలు నెత్తిమీద పడ్డాయి" అంది అమ్మమ్మ.

"పిన్నీ! నెత్తురు కారుతూంది, పిన్నీ! పసుపు తెస్తానుండు!" అంటూ హడావిడిగా లోపలికి వెళ్ళింది అమ్మ.

"ఏమోరా! నాయనా! ఎప్పుడో ఇలా అర్ధాంతరంగా రాలిపోవలసినదాన్నే! ఆ భగవంతు డిలా ఎందుకు ఉంచుతున్నాడో? ఏం పాడో?" కింద చతికిలబడుతూ జాలి గొలిపేటట్లు అంది అమ్మమ్మ.

ఆమెని ఆ స్థితిలో చూస్తుంటే నా గుండెలు రంపంతో కోసినట్టయింది. పాపం! అమ్మమ్మది ఎంత దీనమైన బ్రతుకు! అమ్మమ్మ వంక జాలిపడుతూ చూశాను. అంతకన్నా అమ్మమ్మని ఎలా ఓదార్చాలో తెలియలేదు.

అమ్మ పసుపు తెచ్చి పెట్టబోతుంటే అమ్మమ్మ హఠాత్తుగా వెనక్కి జరిగింది.

"ఆగవే! అమ్మడూ! ఇంట్లో మీ బాబాయి బతికున్నప్పుడు పూజచేసి పెట్టిన పసుపు కుంకుమలు భద్రంగా దాచిపెట్టాను. అవి పెట్టుకోనా?" అమ్మ ముఖంలోకి అమాయికంగా చూస్తూ పరమ పిచ్చిదానిలాగా అడిగింది అమ్మమ్మ.

ఆ మాటలకి నా ఒళ్ళు పులకరించినట్లయింది. అమ్మమ్మది ఎంతటి అమాయికత్వం! తాతయ్య మీద ఎంత భక్తి! ఆ పసుపు కుంకుమలంటే ఎంత నమ్మకం! అమ్మమ్మ వట్టి పసిపిల్ల.

"సరే! నీ ఛాదస్తమూ, నువ్వునూ! అరేదో త్వరగా కానీ! పద!" అమ్మ విసుక్కుంటూ అమ్మమ్మని వాళ్ల ఇంటికి తీసుకువెళ్ళింది.

నా మనసు చివుక్కుమంది.

ఏం? తను పెడుతున్న పసుపుకన్న అమ్మమ్మకి తాతయ్య పూజచేసిన పసుపు మీద నమ్మకం! ఛాదస్తం అనటానికి అమ్మెవరు? ఏమిటి ఈ దారుణం?

నాతోను అమ్మ సరిగ్గా ఇల్లాగే మాట్లాడుతుంది. ఏమీ తెలియని వాజమ్మని చూసినట్లు చూస్తుంది. ఈ రోజు బలవంతంగా తలంటి పోయించింది. నాకేమీ చేతకాదని తనే తుడిచింది.

అమ్మ మీద ఒళ్ళు మండిపోయింది!

నాలో ఉన్న ప్రతిభ అమ్మ ఎందుకు గుర్తించదు? రష్యా వెళ్లి వచ్చానంటే ఎంత కష్టమో ఎందుకు తెలుసుకోలేదు? ఒక యూనివర్శిటీలో రీడరునంటే ఎంత గౌరవం ఉంటుందో ఎందుకు తెలుసుకోలేదు?

నన్నూ, అమ్మమ్మనీ జతగా ఒక పక్క కూర్చో బెట్టి 'ఈ లోకంలో మీ రిద్దరూ వాజమ్మలు!' అని చెప్పినట్లు అనిపించింది.

అమ్మ వచ్చింది. భోజనానికి లేవమంది. భోజనం చేస్తూ ఆలోచిస్తున్నాను.

అవును. మేమిద్దరమూ వాజమ్మలమే. మేము అవతలివాళ్లకి అనవసరపు విలువ ఇస్తాము. ఎదురు చెప్పలేము. 'పెద్దవాళ్ళు కదా!' అని నేనూ, 'నాకేం తెలుసులే' అనుకుని అమ్మమ్మా!

నాకు అమ్మమ్మ మీద విపరీతమైన సానుభూతి కలిగింది. నేనూ, అమ్మమ్మా జతే అనిపించింది. అమ్మమ్మకి పాపం, ఈ లోకంలో బతకటం ఎలాగో నేర్పాలి!

"అమ్మడూ! అమ్మడూ!" ఆందోళనగా మరో సారి లోపలికి దూసుకువచ్చింది అమ్మమ్మ. "ఈ గాయం విపరీతంగా సలపరిస్తూందే, తల్లీ! ఈ రాత్రి

గడుస్తుందో? గడవదో? గుటుక్కుమనేటట్లున్నానే, అమ్మా!"

"అయ్యో! ధైర్యంగా ఉండు, పిన్నీ! ఏమీకాదు! రోసి 'ఈ రాత్రికి మా ఇంట్లో పడుకో" అంది అమ్మ.

"అదుగో, ఆ సంగతి మాట్లాడటానికే వచ్చానే అమ్మా! మీరే ఎవరైనా ఈపూటకి అక్కడ పడుకోండి. ఏదో! ఆయన కట్టించిన ఇల్లూ! ఆయన చేయించిన మంచం! నేను వేరేచోట పడుకోలేనే, తల్లీ!"

అమ్మ విసుగ్గా వంటింట్లో వించి వెళ్లిపోయింది. చెయ్యి తుడుచుకుంటూ అమ్మ వెనకే వెళ్లాను.

'పట్టి ఛాదస్తపు ముండ! తను చస్తే లోకానికేదో మునుచుకుపోయినట్లు! ఏమిటా ధోరణి?' అమ్మ విసుక్కుంటూంది. నా మనసు చివుక్కుమంది. ఆ దయలేనితనాన్ని చూస్తుంటే ఒళ్లు మండింది.

"అమ్మా! నేను ఈ రాత్రికి అమ్మమ్మ ఇంట్లో పడుకుంటాను" అన్నాను.

"ఏ మొహం పడుకుంటావు!" అంది అమ్మ తేలికగా తీసేస్తూ.

"మొహంలేదు, గిహంలేదు. ఈ రాత్రి అక్కడే పడుకుంటాను. అమ్మమ్మని నువ్వంత చులకనగా చూడటం నేను సహించను!" తెగించి అన్నాను.

విశ్మయంగా అమ్మ మనసు చివుక్కుమంది. "సరే కానీ!" అంది దిగజారిపోయిన గొంతుతో. పాలేరు మంచం, పరుపు అమ్మమ్మ ఇంటికి జేరవేశాడు.

అమ్మమ్మ ఒక రాత్రివేళ "ప్రాణాలు పోతున్నట్లున్నాయి! భగవన్నామం చెయ్యరా, నాయనా!" అంది. మారుమాట్లాడకుండా తెల్లవారేదాకా "హరేరామ! హరేరామ! రామ! రామ! హరే! హరే . . ." అంటూ కూర్చున్నాను.

తెల్లవారింది. అమ్మమ్మ శుభ్రంగా లేచి కూర్చుంది. నెత్తిమీద గాయం పెచ్చుకడుతూంది. "ఇంకేం ఫరవాలేదు, అమ్మమ్మా!" అన్నాను ఆ బోడిగుండు వంక చూస్తూ. అమ్మమ్మ పరమానంద భరితురాలైంది. "పొన్నేరా నాయనా! నీ కడుపు చల్లగా . . . దేవుడిలా కాపాడావు" అని దగ్గరికి తీసుకుంది.

నేను ఇంటికి వచ్చాను. కాఫీ తాగుతున్నాను.

అమ్మమ్మ మళ్లీ వచ్చింది. పీట వేసుకుని తాపీగా కూర్చుంటూ "నువ్వొక మాటు ఇలా రావే, అమ్మడూ!" అని పిలిచింది ఏదో పెద్ద విషయం మాట్లాడబోతున్నట్లు.

"ఊఁ! ఏమిటో చెప్పు! అవతల బోలెడు పను లున్నాయి!" అంది అమ్మ విసుగ్గా, హడావిడిగా.

"ఏమీలేదే. అమ్మా! నిన్న రాత్రి అంతా ఆలోచించాను, 'ఈ దెబ్బ ఎందుకు తగిలిందా?' అని. సరిగ్గా అర్ధరాత్రి వేళ తెలిసింది. అది సరేకాని, ఫలనాది ఒద్దు తక్కువ పని అని పెద్దలు చెప్పిన తరవాత ఆ పని మళ్లీ చెయ్యొచ్చా?" అమ్మమ్మ అడిగింది.

"చెయ్యకూడదు!" అంది అమ్మ వెంటనే విసుగ్గా, జవాబు వెంటనే చెప్పకపోతే ఆ ప్రశ్నే పదిమాట్లు ఎక్కడ వేస్తుందోనన్న భయంతో.

"ఒప్పుకున్నావు గదా! మీ బాబాయికి ఉల్లిపాయ లేవి ఏమైనా వండితే మహామంట. ఒకసారి ఇల్లాగే ఏమైందనుకున్నావు? ఆయన ఊరు వెళ్లారు. ఇప్పుడప్పుడే రారు కదా అని . . ." అమ్మమ్మ వాక్యాన్ని రహస్యంగా పూర్తిచేసింది. "ఉల్లిపాయలేసి పులుసు కాచుకుని తిన్నానే, అమ్మడూ!" ఆశ్చర్యంతో బుగ్గలు నొక్కుకుంటూ "ఆ సంగతి ఎల్లా తెలిసిందో? ఏమో? నెత్తిమీద ఒక్క మొట్టికాయ వేశారు" అంది.

"ఆ సంగతి నేను జ్ఞాపకం పెట్టుకోవాలా? అక్కర్లేదా?" గొంతు మళ్లీ తగ్గించి "మళ్లీ నిన్న బుద్ధి గడ్డితిని, నోరు చవిచచ్చినట్లుంటేను — తప్పేముందిలే అని — ఉల్లిపాయల పులుసేసుకు తిన్నానే, అమ్మడూ!" ఇహ ఈ ముండకి ఇల్లా చెబితే కాదు అనుకున్నారో ఏమో! కట్టెపుల్ల తీసుకుని నెత్తిమీద ఒక్కటేసుంటారు! లేకపోతే ఆయన పూజచేసిన పసుపు పెడితే అంత వెంటనే తగ్గుతుందా, చెప్పు? ఆయన ధర్మరాజే, అమ్మా!"

అంతవరకూ నవ్వు ఆపుకుంటున్న అమ్మ ఫక్కున నవ్వింది. ఆ నవ్వు చూసిన నా కళ్లలో నీళ్లు తిరిగాయి! అమ్మమీద పట్టరాని అసహ్యం వేసింది. అమ్మమ్మలోని అసాధారణమైన మంచితనం పట్ల ఎంత చులకన?

నా రక్తం ఉడికిపోయింది.

నే నీ రోజు ఒక రీడర్ని. సంఘంలో ఉన్నతమైన స్థానం ఉన్నవాణ్ని. అలాంటి నేను ఎం. ఎ. చదివిన ఆడది నాలో ఆకర్షణ లేదని, నాకు గౌరవం ఇస్తుందా? ఇవ్వదా? నేను ప్రేమిస్తున్నంత గాఢంగా నన్ను ప్రేమిస్తుందా? లేదా? అని మధనపడుతున్నాను. మరి, తాతయ్య? ఉల్లిపాయ పులుసు రుచి తెలియని ఛాందసుడు. భార్యలోని ఆ చిన్న కోరిక సహించని కఠినాత్ముడు.

కాని అమ్మమ్మకి తాతయ్యమీద ఎంత గురి!

ఆయన కట్టిన ఇల్లు! ఆయన చేయించిన మంచం! ఆయన పూజచేసిన పసుపు! నోరు చవిచచ్చినట్లుంటే మళ్లీ ఇన్నాళ్లకి ఉల్లిపాయ పులుసు!

ఎంత చిన్నతప్పు? ఆ కట్టెతో ఎంత దారుణమైన శిక్ష! కానీ అమ్మమ్మ దాని నెంత హృదయపూర్వకంగా ఆమోదిస్తూంది!

లేదు! మృత్యువు చంపినా, అమ్మమ్మ తాతయ్యని చావనివ్వలేదు. తనకి నచ్చని ఏ చిన్న తప్పుచేసినా కఠినంగా శిక్షించటానికి, దెబ్బ తగిలితే వెంటనే మాన్పటానికి ఆ ఇంట్లో, ఆ మంచంలో, ఆ పసుపులో జాగ్రత్తగా దాచిపెట్టుకుంది. "భర్త ఉన్న వితంతువు"లకన్న అమ్మమ్మ లక్షరెట్లు పవిత్రమైన సుమంగళి! ఆమెని చూసి నవ్వే అధికారం ఎవరికీ లేదు.

అమ్మవంక అసహ్యంగా చూశాను.

* * *

నన్ను పెళ్లికొడుకుని చేస్తున్నారు.

చుట్టూ పది పదిహేనుమంది ముత్తైదువలు. మంగళహారతి పాడి ఒక్కొక్కళ్లే హారతి అద్ది కుంకుమ పెడుతున్నారు.

అమ్మమ్మ అమాయికంగా, పసిపిల్లలా, ఆనందంగా చూస్తూ అందరికీ దూరంగా పెడగా నిలబడింది.

నా గుండెలు పిండినట్లయింది! అమ్మమ్మకేం లోటని అలా నిలబడాలి?

ముత్తైదువల చేతినుంచి హారతి పళ్ళెం అందుకున్నాను. కుంకుమభరిణ తీసుకున్నాను. నడిచి వెళ్లి అమ్మమ్మ చేతికిచ్చాను.

"ఆశీర్వదించు!" అని కాళ్లకి దణ్ణం పెట్టాను. ★

## మేషం (అశ్వ., భర., కృత్తి. 1పా.)

గ్రహస్థితి ఏమంత బాగుండలేదు. అశాంతికర పరిస్థితులలో మునిగి ఉన్నారు. ఆరోగ్యం జాగ్రత్త. మిత్రులని అందరనూ నమ్మకండి. ధైర్యంగా స్వబుద్ధితో ముందుకు వెళ్లండి. మీ బాధ్యతలను నిర్వర్తించడం కష్టమవుతుంది. ఆర్థికంగా ఒత్తిడి ఉంటుంది. అప్పులు చేయవలసి రావచ్చును. 7 వ తేదీ ఆరోగ్యం విషయంలో మెలకువ అవసరం. దూర ప్రయాణాలు చేయకండి. అయినా దైవంమీద భారంవేసి పని చేయండి. ఇతరులతో కలిసి పనిచేయడం మంచిది. వ్యాపారంలో కూడా. 3, 6, 7, 8 తేదీలు మంచి రోజులు.

## వృషభం

(కృత్తి. 2,3,4 పా., రోహి., మృగ. 1,2 పా.)

మంచికాలం. గ్రహస్థితి బాగున్నది. మీ రాశ్యధిపతి శుక్రుడు లాభంలో మీనంలో ఉండడం ఆధ్యాత్మిక విజ్ఞాన సంపాదనకు అనుకూలం. మిత్రులు బాగా సాయపడతారు. వివాహాది ప్రయత్నాలకు మంచిది. కొంత వ్యతిరేకత వచ్చినా తుదకు సఫలమవుతుంది. ఉద్రేకపడడం మానివేయండి. ముఖ్యమైన ప్రయాణం చేయవలసి రావచ్చును. ఖర్చులు పెరుగుతవి. ద్వాదశంలో శని మట్టుకే మీకు ఆటంకంగా ఉంటాడు. శనిస్తోత్రం చేయండి. యజమాని ఉదాసీనంగా ఉంటాడు. భాగస్థులతో చేరి చేసే వ్యాపారం లాభకారి. 3, 6, 7, 8 తేదీలు మంచి రోజులు.

## మిథునం

(మృగ. 3,4 పా., ఆరు., పున. 1,2,3 పా.)

చతుర్థ దశమాలలో ప్రధాన గ్రహస్థితి కుటుంబ వ్యవహారాలపై మీ దృష్టిని మరలుస్తుంది. కొన్ని మార్పులో, కొత్త సౌకర్యాలో చేసుకోజూస్తారు. మీ స్థితిని బట్టి కొందరికి వాహన యోగం ఉంటుంది. రవిచారం మీకు పై అధికారుల ఆదరాభిమానాలు చేకూరుస్తుంది. యజమాని దృష్టిని ఆకర్షిస్తారు. కాస్త డబ్బు ఒత్తిడి ఉన్నా భయం లేదు. బంధువులతో వివాదపడకండి. ఉదర సంబంధమైన జబ్బులుంటే జాగ్రత్తగా చూచుకొనండి. వ్యాపారస్థులకు లాభకాలం. వ్యాపారం పెంచుకునే అవకాశం ఉంది. 3, 6, 7, 8 తేదీలు మంచి రోజులు.

## కర్కాటకం (పున. 4 పా., పుష్య., ఆశ్లే.)

గ్రహాలన్నీ తృతీయ, పంచమ నవమ భావాలపై ప్రభావం కలవి. మనస్సు, ఉత్తర ప్రత్యుత్తరాలు, పిల్లల వ్యవహారాలు, వృత్తి ఉద్యోగాదుల గూర్చిన వ్యవహారాలు ప్రధానమవుతవి. పైవారి సహాయం అర్థిస్తారు. మత దృష్టి పెరిగి పెద్దలను సేవిస్తారు. పరిస్థితి బాగుంటుంది. భౌతికంగా కంటె మానసికంగా క్రియాశీలు రవుతారు. యోగాదులపై శ్రద్ధ గల వారు వానిలో సఫలులవుతారు. ఉద్యోగ ఆర్థిక రంగాలలో బాగుంటుంది. శనివల్ల కొంత ఆలస్యం తప్పదు. వ్యాపారస్థులు సాహసంతో పనిచేస్తారు. 3, 7, 8 తేదీలు మంచి రోజులు.